# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 62 | శుక్రవారం, 30 జనవరి 2026 | పేజీలు : 7




**మేడారం మహా జాతరలో** రెండో రోజు మహా ఘట్టం అవిష్కృతమైంది. కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్క తల్లి 'వనం వీడి జనంలోకి' వచ్చింది. భక్తులకు దర్శనమిచ్చింది. పున్నమి చంద్రుడు వెన్నెల్లు వెదబల్లుతుంటే.. వెదురులంక వనంలోంచి లోకాలు కాపాడగా సమ్మక్క తల్లి అడవి నుంచి బైలెల్లింది. ఎర్రని వస్త్రాలు కట్టుకుని ఆదివాసీలు నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేపట్టి.. మేడారానికి సమ్మక్క తల్లిని గద్దెపైకి తీసుకొచ్చారు. సమ్మక్క రాకతో మేడారం భక్తజన సంద్రంగా మారింది. సమ్మక్క నామస్మరణతో హోరెత్తిపోతుంది. వసంలోంచి సమ్మక్క జనసంద్రం నడుమకు చేరుకుంది. ఈ ఘట్టాన్ని చూసేందుకు లక్షలాది మంది భక్తులు చిలకటగట్టుకు చేరుకున్నారు. అమ్మవారు వచ్చే దారి పొడవునా భక్తులు తాము కోరిన కోర్కెలు తీరాలని ఎదురుకోళ్లు ఎగరేస్తూ.. యాటలు.. కోళ్లు బలిస్తూ శివసత్తులు అమ్మవారిని కొలుస్తూ.. కొమ్ము బూరలు.. సాంప్రదాయ డోలువాయిద్యాలతో ముందుకు సాగారు..

- మేడారం ప్రత్యేక ప్రతినిధి, మన చౌరాస్తా





# తల్లొచ్చింది

- గద్దెను చేరిన సమ్మక్క తల్లి
- వనం వీడి జనంలోకి వచ్చిన అమ్మ
- అధికార స్వాగతం పలికి ప్రభుత్వం
- మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు

2







### కిక్కిరిసిన క్యూ లైన్లు..

గత రెండు రోజుల నుంచి జాతరకు భక్తుల తాకిడి ఎక్కువైంది. ఇందుకు తగ్గట్లుగా ప్రభుత్వం, ఆలయ అధికారులు ఏర్పాట్లు చేసినప్పటికీ పలు చోట్ల భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరో వైపు వీఐపీలు, వీవీఐపీల తాకిడి కూడా పెరిగింది. గురువారం సమ్మక్క రాకకు ముందే కేంద్ర గిరిజన మంత్రి జోయల్ ఓరం , కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. వీరితో పాటు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క, పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ అమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వీరికి మంత్రులు సీతక్క, శ్రీనివాస్ రెడ్డి, అధికారులు సదర స్వాగతం పలికారు.

# తల్లొచ్చింది..!

- గద్దెను చేరిన సమ్మక్క తల్లి
- వనం వీడి జనంలోకి వచ్చిన అమ్మ
- అధికార స్వాగతం పలికి ప్రభుత్వం
- మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపిన ములుగు ఎస్పీ





**మేడారం, మన చౌరాస్తా :** మేడారం మహా జాతరలో రెండో రోజు మహా ఘట్టం అవిష్కృతమైంది. కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్క తల్లి 'వనం వీడి జనంలోకి' వచ్చింది. భక్తులకు దర్శనమిచ్చింది. పున్నమి చంద్రుడు వెన్నెల్లు వెద బల్లుతుంటే.. వెదురులంక వనంలోంచి లోకాలు కాపాడగా సమ్మక్క తల్లి అడవి నుంచి బైలెల్లింది. ఎర్రని వస్త్రాలు కట్టుకుని ఆదివాసీలు నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేపట్టి.. మేడారానికి సమ్మక్క తల్లిని గద్దెపైకి తీసుకొచ్చారు. సమ్మక్క రాకతో మేడారం భక్తజన సంద్రంగా మారింది. సమ్మక్క నామస్మరణతో హోరెత్తిపోతుంది. వసంలోంచి సమ్మక్క జనసంద్రం నడుమకు చేరుకుంది. ఈ ఘట్టాన్ని చూసేందుకు లక్షలాది మంది భక్తులు చిలకటగట్టుకు చేరుకున్నారు. అమ్మవారు వచ్చే దారి పొడవునా భక్తులు తాము కోరిన కోర్కెలు తీరాలని ఎదురుకోళ్లు ఎగరేస్తూ.. యాటలు.. కోళ్లు బలిస్తూ శివసత్తులు అమ్మవారిని కొలుస్తూ.. కొమ్ము బూరలు.. సాంప్రదాయ డోలు వాయిద్యాలతో ముందుకు సాగారు..

### అర్ధరాత్రి నుంచే మొక్కులు

కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను ప్రధాన పూజారులు గద్దెపై ప్రతిష్టించారు. చిలకలగట్టు నుంచి 7 గంటల పూజారులు కదిలారు. తల్లి ఆగమనం తెలియగానే ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఏకే 47 గన్తో గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో జాతర అధికారికంగా మొదలైందని చెప్పాలి. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలోని పోలీస్ టీమ్ ముందు నడవగా మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ దివాకర టి.ఎస్ అమ్మవారికి స్వాగతం పలికారు. చిలకులగట్టు నుంచి గద్దెల వరకు సుమారుగా ఒక కిలోమీటరు ఉంటుంది. అడుగడుగునా అమ్మవారి ఆశీస్సుల కోసం పొర్లు దండాలు పెట్టడం.. బలులు ఇవ్వడం డోలు వాయిద్యాలు.. కొమ్ము బూరలు ఊదుకుంటూ అంగరంగ వైభవంగా గద్దెల వరకు తీసుకొచ్చేందుకు దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది. సమ్మక్క తల్లిని రాత్రి 11 గంటల వరకు గద్దెపై ప్రతిష్ఠించారు పూజారులు. అమ్మవారిని తీసుకొచ్చే దారి పొడవునా మహిళలు అందమైన ముగ్గులతో అలంకరించారు. గద్దెల వరకు రాగానే బిందెలతో కాళ్లను కడిగిన తర్వాత లోపలికి ఆహ్వానం పలికి ఆనవాయితీగా పూజలు నిర్వహించారు. అనంతరం ప్రవాహంగా వచ్చిన భక్తులు సమ్మక్క, సారలమ్మను దర్శించున్నారు.

### మేడారం జనసంద్రం..

మేడారం జాతరకు వచ్చిన భక్తులు కచ్చికంగా జంపన్న వాగులో స్నానాలు చేసుకుని.. అదే తడి బట్టలతో అమ్మవార్ల దర్శనానికి ళ్లడం ఆచారం. జంపన్న వాగు బ్రిడ్జికి రెండు వైపులా ఏర్పాటు చేసిన నల్లాల కింది స్నానాలు చేయడానికి భక్తులు ఇసుక వేస్తే రాలనట్లగా తరలి వచ్చారు.







# గిరిజనుల మహా కుంభమేళా.. మేడారం

- దేశంలనే అతి పెద్ద గిరిజనుల పండగ
- కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం
- కిషన్‌రెడ్డితో కలసి గద్దెల వద్ద మంత్రుల ప్రత్యేక పూజలు

**మన చౌరాస్తా , మేడారం ప్రత్యేక ప్రతినిధి :** మేడారం సమ్మక్క సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రత్యేకంగా గద్దెలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సం



ప్రదాయ డోలు, డప్పుల నడుమ గద్దెల వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ సమ్మక్క సారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ, ఇది గిరిజనుల మహా కుంభమేళాగా నిలుస్తోందన్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం తాను ఇక్కడికి వచ్చాచనని, ఇప్పుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పవిత్ర జాతరకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు అందిస్తోందని తెలిపారు. లక్షలాది మంది వచ్చే ఈ మహా జాతరలో భక్తులకు కనీస వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.





# ఇప్పటికే 80 లక్షల మంది దర్శనం

- రాత్రికి కోటికి మించే అవకాశం
- శాశ్వత అభివృద్ధి కోసం మరో 41 ఎకరాల భూసేకరణ
- శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మౌళిక సదుపాయాలు
- జంపన్నవాగు నిరంతరంగా పారేలా చర్యలు
- మంత్రులు పొంగులేటి, సీతక్కల వెల్లడి

**మేడారం, మన చౌరాస్తా :** మేడారం సమ్మక్క సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మంత్రి మాట్లాడుతూ గురువారం దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి




స్పష్టం చేశారు. మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ పక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయను న్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు. దక్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యత ను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్ప, లక్నవరం, జంపన్న వాగు వరకు పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.




## పొంగులేటి.. బైక్‌పై..

**మేడారం, మన చౌరాస్తా :** మేడారం సాక్షిగా... అట్టహాసాల హంగులు లేవు.. కాన్వాయ్‌ల ఆర్భాటాలు లేవు.. జనం మధ్యకు వెళ్లాలనే తపన.. భక్తుల కష్టాలు స్వయంగా చూడాలనే సంకల్పం! తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మేడారం పర్యటన అలా సాగింది. గురువారం తెల్లవారుజాము నుంచి కార్యక్షేత్రంలోకి దిగి అందరినీ ఆశ్చర్య పరిచారు. మొన్నటి వరకు మేడారం అభివృద్ధి పనులను పర్యవేక్షించిన ఆయన ఇప్పుడు మేడారం జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దగ్గరుండి మరీ పర్యవేక్షించారు. గత రాత్రి గ్దదె చేరిన పెద్దమ్మలను సతీసమేతంగా దర్శనం చేసుకున్న పొంగులేటి తెల్లారేసరికల్లా ఓ సేవా కార్యకర్తలా కదనరంగంలోకి దూకారు. జిల్లా కలెక్టర్ టి.ఎస్.దివాకర్‌ను తన వెనుక కూర్చోబెట్టుకుని, స్వయంగా బైక్ నడుపుతూ గల్లీ గల్లీని చుట్టేశారు.







# వనం నుంచి జనంలోకి..














# ములకనూరులో జాతరలో దర్శనాలు

- **నిలువెత్తు బంగారం సమర్పించిన మంత్రి పొన్నం**



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం ములకనూరు గ్రామంలో నిర్వహిస్తున్న సమ్మక్క-సారలమ్మల జాతర సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ములకనూరు గ్రామంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు కలిసి సమ్మక్క-సారలమ్మల జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. గతంలో ఇక్కడ అమ్మవార్లు గద్దెలపైకి వచ్చే సమయంలో ఫైరింగ్ నిర్వహించే సంప్రదాయం ఉండేదని, సుమారు 20 సంవత్సరాల వరకు ఆ ఆచారం కొనసాగిందని తెలిపారు. స్థానిక నాయకులు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో డీజీపీ, సీపీ అధికారులతో చర్చించినట్లు మంత్రి వెల్లడించారు. దీని ఫలితంగా ఈ రోజు సాయంత్రం ప్రభుత్వం తరపున అమ్మవార్లకు ఘన స్వాగతం పలుకుతూ, ములకనూరులో అమ్మవార్లు గద్దెలపైకి వచ్చే ముందు ఫైరింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇది భక్తుల మనో విశ్వాసానికి ప్రతీకగా, సంప్రదాయబద్ధంగా గత 44 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆచారమని మంత్రి వివరించారు. ఈ జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారని చెప్పారు. ఈ ప్రాంతమంతా సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే భీమదేవరపల్లి, ఎలకతుర్తి మండలాల రైతులు, అంజి వర్గాల ప్రజలపై అమ్మవార్ల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి ఆటంకం లేకుండా కింది స్థాయి ప్రజల వరకు చేరాలని, భవిష్యత్తులో ప్రభుత్వం మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు అమలు చేసే శక్తిని అమ్మవార్లు ప్రసాదించాలని ప్రార్థించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి,జాతర కమిటీ చైర్మన్ జక్కుల ఐలయ్య నాయకుడు తదితరులు పాల్గొన్నారు.



# జాతరలో వైద్య శిబిరం ఏర్పాటు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** మినీ సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా విచ్చేసిన భక్తుల ఆరోగ్య భద్రత కోసం ప్రథమ చికిత్స వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిబిరంలో అత్యవసర మందులు, టిటి ఇంజెక్షన్లు, ఏఆర్వీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 108 అంబులెన్స్ వాహనం కూడా శిబిరం వద్ద అందుబాటులో ఉంది. 24 గంటల పాటు మూడు షిఫ్ట్‌లలో వైద్య సిబ్బంది విధుల్లో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ గారి ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరిగింది. డా. జ్యోత్స్న, డా. రహ్మాన్‌తో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు విధుల్లో పాల్గొని భక్తులకు సేవలందిస్తున్నారు.

# సమ్మక్కకు స్వాగతం

**భీమదేవరపల్లి,మన చౌరాస్తా :** మినీ మేడారంగా పిలిచే ముల్కనూర్ సమ్మక్క సారలమ్మ జాతరకు 25 ఏళ్ల తర్వాత మరో అవకాశం దక్కింది. 25 ఏళ్ల క్రితం ఆగిపోయిన ఫైరింగ్ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో నేడు చిలకలగుట్ట నుండి సమ్మక్క ఆగమనం జరుగుతున్న వేళ కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి నేతృత్వంలో ఐదు రౌండ్ల కాల్పులు జరిపి పోలీసులు సాదరంగా స్వాగతం పలికారు.



# అమ్మవార్లకు వెండి కుంకుమ భరణిలు అందించిన కూరపాటి

**భీమదేవరపల్లి,మన చౌరాస్తా :** ముల్కనూర్ సమ్మక్క సారమ్మలకు హనుమకొండ కూరపాటి హాస్పిటల్స్ అధినేత రమేష్ దంపతులు వెండి కుంకుమ భరణిలు కానుకగా అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, జాతర కమిటీ చైర్మన్ జక్కుల ఐలయ్యలు కూరపాటి దంపతులను ఘనంగా సన్మానించారు.



# ప్రభాకర్ ప్రకటనలతో పార్టీకి సంబంధం లేదు

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి పేరుతో మల్లెపల్లి ప్రభాకర్ చేసిన పత్రిక ప్రకటనలకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, ప్రగతిశీల యువజన సంఘం(పి వై ఎల్) రాష్ట్ర కార్యదర్శి సంతోష్ నాయక్ గురువారం ప్రకటనలో వెల్లడించారు. పార్టీ, ప్రజా సంఘాలకు చెందిన శ్రేణులు ఇలాంటి తప్పుడు ప్రకటనలను విశ్వసిచాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. నెల రోజుల కిందట పార్టీ కేంద్ర కమిటీ సమావేశం సూర్యపేటలో జరిగిందని అన్నారు.అందులో జాతీయంగా,అంతర్జాతీయంగా వస్తున్న మార్పులపై సమీక్షించిందని ,అందులో బాగంగా పార్టీ నిర్మాణ పని విధానంలో కొన్ని మార్పులు చేపట్టిన క్రమంలో పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా మల్లెపల్లి ప్రభాకర్ పేరుతో ఎలాంటి బహిరంగ పత్రిక ప్రకటనలు ఇవ్వకూడదని తీర్మానించామని అన్నారు.అందుకు విరుద్ధంగా నేడు ఏకపక్షంగా,పార్టీలో ఎలాంటి చర్చ లేకుండా తన వ్యక్తగత పని విధానంలో బాగంగా ప్రజా సంఘాల రద్దు పేరుతో వచ్చిన ప్రకటనలపై పార్టీ ప్రజా సంఘాలకు చెందిన శ్రేణులు ఎలాంటి గందరగోళానికి గురి కావల్సిన అవసరం లేదని గుర్తుచేశారు. త్వరలోనే పార్టీ ప్లీనరీ సమావేశాలు జరుగుతాయని, అందులో ప్రభాకర్ అనుసరించిన పార్టీ రాజకీయ, నిర్మాణ వ్యతిరేక పని విధానంపై ప్రభాకర్ తో చర్చిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.



## ఢిల్లీ లో జాతీయ స్థాయి

# ఓసీల మహా ధర్నా

- **ఓటుబ్యాంకు రాజకీయాలతో మున్సిపల్ వార్డు రిజర్వేషన్లలో అన్యాయం**
- **ఫిబ్రవరి 23న ఢిల్లీ లో జాతీయ స్థాయి ఓసి ల మహా ధర్నా**
- **ఓసి జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు**

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారు రిజర్వేషన్ల లేమి కారణంగా అటు సంక్షేమ పథకాల ఫలాలు, ఇటు రాజకీయ పదవులు పొందలేక పోతున్నారని ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు. గురువారం హైదరాబాద్ లోని ఖాజా మాన్షన్ ఫంక్షన్ హాల్లో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కులగణన లో కులగనన..సమగ్ర చర్చ రౌండ్ టేబుల్ సమావేశానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు మాట్లాడుతూ ఓసి ల జనాభా 21.5శాతం అండగా అందులో పటాన్లు,సయ్యద్ లు ఉన్నారని, రాజకీయ రిజర్వేషన్లు లేని కారణంగా ఓసీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని తెలిపారు.ఇటీవలి సర్పంచ్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో సైతం ఎదుటివారి ఆర్థిక, అంగ బలం ముందు ఓసి అభ్యర్థులు సరితూగ లేక జనరల్ స్థానాల్లో కనీసం 50శాతం సీట్లు కూడా గెలుచుకోలేక పోయారని విచారం వ్యక్తం చేశారు.ఓటుబ్యాంకు రాజకీయాలతో ఓసిలకు నేటికీ తీవ్ర అన్యాయం జరుగుతున్నదని అన్నారు. నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలకు త్వరలో జరగనున్న ఎన్నికల వార్డు రిజర్వేషన్లలో ఓసి లకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు.మున్సిపల్ రిజర్వేషన్లలో ఓసి లను అణగదొక్కాలనే పాలకుల బ్యూరో క్రాట్ల కుట్ర స్పష్టంగా బయట పడిందన్నారు.ఓసి ల జనాభా 80 శాతం ఉన్న వార్డుల, డివిజన్లుఎస్సీ ఎస్టీ, బీసీ లకు రిజర్వు కాగా, ఎస్సీ ఎస్టీ బీసీ లు 79 నుంచి 88 శాతం ఉన్న ప్రాంతాలను జనరల్ కేటగిరీలో చేర్చడం పాలకుల బ్యూరో క్రాట్ల కుట్రకు నిదర్శనం అన్నారు.ప్రస్తుతం జనరల్ కేటగిరీకి రిజర్వు చేయబడిన స్థానాల్లో ఓసీయేతరులు 80 శాతం ఉండటం తో ఓసి లు అక్కడ గెలుపొందే పరిస్థితి లేదన్నారు. శాస్త్రీయంగా లేని రిజర్వేషన్ల మార్పుపై తక్షణమే ఒక నిర్ణయం తీసుకోని పక్షంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఓసి లు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడం తథ్యమని నాయకులు హెచ్చరించారు. జనరల్ స్థానాల్లో కూడా ఓటు బ్యాంక్ రాజకీయాల తో ఓసీ యేతరులకు కొన్ని రాజకీయ పార్టీలు టికెట్లు ఇచ్చి ఓసిలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదే ఇదే విధమైన విధానాలు అనుసరించడం వల్ల ఓసి లు సర్పంచ్ అవకాశాలు కోల్పోయారని వెల్లడించారు.తాము ఏ వర్గాలకు వ్యతిరేకం కాదని, అన్ని వర్గాల ప్రజలకు అన్ని రంగాల్లో సమన్యాయం జరగాలన్నదే ఓసి జేఏసీ ధ్యేయమని పేర్కొన్నారు.స్థానిక ఎన్నికల్లో ఓసిలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు తమ డిమాండ్లకు మద్దతు తెలుపని మున్సిపల్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని పోలాడి హెచ్చరించారు.

### కుట్రలు సాగనివ్వం

రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై జరుగుతున్న అసత్య ప్రచారాలు, కొందరు తమలబ్దికోసం చేస్తున్న కుట్రలను సాగానివ్వబోమని స్పష్టం చేశారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పటిష్ట అమలుకు ప్రత్యేక జాతీయ కమిషన్ ఏర్పాటు చేయాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పడ్డ 10 శాతం ఈడబ్లూఎస్ రిజర్వేషన్లపై కొందరు ఆయా కులాల్లోని ప్రజలను మభ్య పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్వార్థ రాజకీయ ప్రయోజనాలు, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం ఓసి లను పలుచన చేయాలనే కుయుక్తులను సాగనివ్వబోమని విరుచుకుపడ్డారు. ఓసి ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు విద్యా, ఉద్యోగ, పోటీ పరీక్షలలో వయోపరిమితిని పెంచాలని , ఈడబ్ల్యూఎస్ వారికి కేటాయించగా మిగిలిన బ్యాక్ లాగ్ పోస్టులను ఆ వర్గాల వారితోనే వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి 10లక్షల ఆదాయ పరిమితి పెంచాలన్నారు.ప్రస్తుతమున్న 59 శాతం దాటని రిజర్వేషన్లలో ఓసి లకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ఓసీల లోని నిరుపేదలకు వర్తింప చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ఫిబ్రవరి 23న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఓసి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన జాతీయ స్థాయి ఓసిల మహా ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయాల కతీతంగా ఓసి సామాజిక వర్గీయులు తరలి వచ్చి విజయవంతం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం వేదికగా మావేశంలో పాల్గొన్న పోలాడి రామారావు పిలుపు నిచ్చారు ఫిబ్రవరి 23 న డిల్లి మహా ధర్నాకు మద్దతు ఇవ్వాలనిజాగృతి అధ్యక్షురాలు కవిత కు పోలాడి రామారావు ఆహ్వాన పత్రం అందజేయగా సానుకూలంగా స్పందించిన కవితకు పోలాడి రామారావు ఓసి జేఏసీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జంపన్న తీరంలో..

# జనమే జనం



# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- **సజావుగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ**
- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా జరుపుటకు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. గురువారం జనగామ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, అభ్యర్థుల దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను, సంబంధిత రిజిష్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్లు సమర్పించే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే నామినేషన్ పత్రాలకు జత చేవల్సిన ధృవపత్రాలు సరిగా ఉన్నాయా లేదా తనిఖీ చేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ లో జాగ్రత్తగా వ్యవహరించాలని అలాగే పలు సలహాలు, సూచనలు చేస్తూ అధికారులకు దిశనిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ మున్సిపల్ ఎన్నికలు జరుపుటకు ఈ నెల 27వ తేదిన నోటిఫికేషన్ జారీ చేసిందని గుర్తుచేస్తూ, జనగామ జిల్లాలో జనగామ మున్సిపాలిటీలో 30 వార్డులు, స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీలో 18 వార్డులు మొత్తం 48 వార్డులకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. తదనుగుణంగా ఎన్నికలు నిర్వహించుటకు ఈ నెల 28, 29 మరియు 30వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు అభ్యర్దులు నామినేషన్లు దాఖలు చేయుటకు చివరి తేది అని అన్నారు. నామినేషన్ వేయాలనుకునే అభ్యర్థులు చివరి రోజున హడావుడితో ఇబ్బందులు పడకుండా ముందుగా నామినేషన్లు దాఖలు చేయుటకు వీలుకల్పించుకోవాలని కలెక్టర్ కోరారు. అభ్యర్థులకు ఎమైనా సమస్యలు, అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకునేందుకు హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేశామన్నారు. రోజువారిగా దాఖలు అయిన నామినేషన్ల వివరాలను టిపోల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణలో జరుపుటకు రిటర్నింగ్ అధికారులను, నోడల్ అధికారులను, ఫ్లయింగ్ స్క్వాడ్ , ఇతర బృందాలను ఇప్పటికే నిమించామని, సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో మున్సినల్ కమీషనర్ మహేశ్వర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** పవిత్ర రంజాన్‌కు ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనగామ ఆర్డీవో గోపి రామ్, ఎసిపి ఘన్‌పూర్ భీమ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధ్యక్షతన వచ్చే నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రంజాన్ మాసం నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు, శాంతి కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్యారోగ్య, ఆర్ అండ్ బీ, విద్యుత్, పౌరసరఫరాలు, తదితర శాఖల అధికారులతో పాటు పలువురు మత పెద్దలు పాల్గొని ఏర్పాట్ల విషయమై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 18వ తేదీ కల్లా అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో సిద్ధం చేసి ఉంచాలన్నారు. ఈద్గాల వద్ద తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. తాగునీరు అవసరమైన చోట్ల అదనంగా నీటి ట్యాంకర్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. మసీదుల వద్ద చెత్త డబ్బాలను ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలన్నారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. రాత్రి 11:30 గంటల వరకు దుకాణాలు నిర్వహించుకోవచ్చని వెల్లడించారు. అలాగే దుకాణాల వద్ద ఆహార భద్రత నియమనిబంధనలను తప్పకుండా అనుసరించాలని, వివిధ పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేనిచో కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. మతపెద్దలు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డాక్టర్ బి.విక్రమ్ కుమార్, తహసీల్దార్లు, జిల్లా అధికారులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలి : కడియం

- **స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం**
- **మినీ జాతరలలో అభివృద్ధి పనుల ప్రారంభం**



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మినీ సమ్మక్క సారలమ్మ జాతరలలో శాశ్వత నిర్మాణాలు చేపట్టి వచ్చే జాతర నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం, జిట్టేగూడెంతాటికొండ, చిల్పూర్ మండలం గార్లగడ్డ తండాఫతేపూర్ లలోని సమ్మక్క-సారలమ్మ జాతరలకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కోసం చేపట్టిన తాగునీటి సరఫరా సౌకర్యాలను, అలాగే తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు, హైమాస్ ఫ్లడ్ లైట్లు వంటి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కడియం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ..., సమ్మక్క-సారలమ్మ జాతరలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో నిర్వహించే అన్ని జాతరలలో త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జాతర నిర్వహణకు సంబంధించి త్రాగునీటి సరఫరా, విద్యుత్ ఏర్పాట్లు, మరుగుదొడ్లు, రహదారి మరమ్మత్తులు, లైటింగ్, పారిశుధ్య చర్యలు, వైద్య శిబిరాలు, పోలీస్ బందోబస్తు వంటి అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులు అధికారులకు, జాతర కమిటీలకు సహకరిస్తూ ప్రశాంత వాతావరణంలో తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలని తెలిపారు. దర్శనం అనంతరం కూడా భక్తులు వారి వారి గ్రామాలకు, ఇళ్లకు సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కక్షపూరిత ధోరణికి నిదర్శనం సిట్ నోటీసులు

- **మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్**



**హనుమకొండ, మన చౌరాస్తా :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడు, భారత రాష్ట్ర సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ గురువారం సాయంత్రం బాలసముద్రంలోని రహదారిపై కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, కేసీఆర్ ప్రతిష్ఠను దిగజార్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఉద్యమం ద్వారా సాధించిన నేతపై కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. పద్నాలుగు సంవత్సరాల సుదీర్ఘ పోరాటం, పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను దేశంలోనే అగ్రభాగాన నిలిపిన ఘనత సాధించారని పేర్కొన్నారు. ప్రజల్లో కేసీఆర్‌ను పలుచన చేయాలనే కుంచిత మనసుతోనే నోటీసులు, కమిషన్లు, ప్రత్యేక దర్యాప్తు బృందాల పేరిట వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నోటీసులు పంపినా, ఎన్ని ప్రత్యేక దర్యాప్తు బృందాలు వేసినా ప్రజల తరపున కేసీఆర్ సైన్యంగా తాము పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు నరెడ్ల శ్రీధర్, పులి రజినీకాంత్, వినయ్, ఉదిత్, వెంకన్న, రఘు, రాజేష్, రాజు, వీపీ రెడ్డి, శరత్ చంద్ర, రామ్మూర్తి, చందర్, మహమూద్, ఇమ్మడి రాజు, రాజ్‌కుమార్, నయీంజుబేర్, స్నేహిత్, రాకేష్‌యాదవ్, షఫీ, వీరస్వామి, వినీల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# 11వ వార్డు బీజేపీ అభ్యర్థిగా రాధిక సంపత్

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు జోరందుకున్నాయి. పట్టణంలోని 11వ వార్డు నుంచి బీజేపీ నుంచి శోభనబోయిన సంపత్ సతీమణి రాధిక తమ నామినేషన్‌ను అధికారికంగా దాఖలు చేశారు. గురువారం తన అనుచరణగణంతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**